

జాతీయస్థాయి నాటక పోటీల కళా వేదికకు శంకుస్థాపన

భీమవరం టౌన్: స్థానిక డిఎన్ఆర్ కళాశాలలో గన్నాబత్తుల క్రీడా మైదానంలో చైతన్య భారతి, సంగీత నృత్య నాటిక పరిషత్ 18వ జాతీయస్థాయి నాటిక పోటీల కళావేదికకు గురువారం పరిషత్ సభ్యులు శంకుస్థాపన చేశారు. ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకూ భీమవరంలో చైతన్యభారతి నాటికల పోటీలను నిర్వహిస్తున్నట్లు నాటక పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు రాయప్రోలు భగవాన్, మంతెన రామ్‌కుమార్‌రాజు, పిర్ఒ భట్టిప్రోలు శ్రీనివాసరావు తెలిపారు. దీనిలో భాగంగానే వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, 17 ఏళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిఎన్ఆర్ కళాశాల జాయింట్ సెక్రటరీ కె.రామకృష్ణంరాజు, అసిస్టెంట్ సెక్రటరీ బోసురాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాయప్రోలు శ్రీనివాసమూర్తి, వబిలిశెట్టి వెంకటేశ్వర్లు, నాటక పరిషత్ కోశాధికారి బొండా రాంబాబు, సభ్యులు కోట్ల నాని, కె.సత్యకుమర్, పేరిచర్ల లక్ష్మణవర్మ, పెన్నాడ శ్రీను, కనగర్ల రామకృష్ణ, కొణకంచి వెంకటరమణమూర్తి, ఎం.హేమసుందర్, అంగరచిన వీరాస్వామి పాల్గొన్నారు.

సిఎం సారూ..

రైతుల గోడు పట్టించుకోరూ..!


ధర కోసం కోకో రైతుల గగ్గోలు
ధర లేక ఆక్వా రైతులు కుదేలు
మామిడి ధర పతనంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరం
నూతన పామాయిల్ పరిశ్రమ, మామిడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ఎదురుచూపు
నేడు ఆగిరిపల్లిలో సిఎం చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా రైతాంగం గుండెకోత ప్రభుత్వానికి పట్టడం లేదు. పండించిన పంటకు ధరలేక ఆక్వా, కోకో, మామిడి, చేపలు సాగుచేసే రైతులు రోడ్డెక్కి ఆందోళనలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. నూతన పామాయిల్ ఫ్యాక్టరీ, మామిడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి రైతులకు మేలు చేస్తామని చెప్పిన మాటల బూటకంగా మారడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో 'మా గోడు పట్టించుకోండి.. సిఎం సారూ'.. అంటూ రైతులు వేడుకుంటున్న పరిస్థితి.

ఏలూరు జిల్లాలోని ఆగిరిపల్లిలో సిఎం చంద్రబాబు శుక్రవారం పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ జిల్లా రైతాంగం వేడుకుంటోంది. జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల్లో కోకో పంటను రైతులు సాగు చేస్తున్నారు. కొబ్బరి సాగుచేసే రైతులకు ప్రధాన ఆదాయ వనరు కోకోనే. గతేడాది కిలో కోకో గింజల ధర అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా రూ.వెయ్యికిపైగా లభించింది. ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం కిలో కోకో గింజల ధర రూ.750 వరకూ ఉన్నప్పటికీ కంపెనీలు మాత్రం కిలో రూ.550కు మించి కొనుగోలు చేయడం లేదు. పాత గింజలను అత్యంత దారుణంగా కిలోకు రూ.300 మాత్రమే ఇస్తామని కంపెనీలన్నీ సిండికేట్‌గా మారి రైతులను దెబ్బతీస్తున్నాయి. కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కొనుగోలు చేయాలని రైతులు రోడ్డెక్కి అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులతోపాటు వ్యవసాయ మంత్రి వరకూ తమ సమస్యను తీసుకెళ్లి చర్చించారు. ఇప్పటి వరకూ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. దీంతో కోకో రైతులు నష్టాలకు తమ పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కోకో రైతులను పట్టించుకోవడం లేదనే ఆవేదన వెంటాడుతోంది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాల నేపథ్యంలో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి ధరలు అమాంతం తగ్గించేశారు. రొయ్య ధర కిలోకు రూ.40 వరకూ తగ్గిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. వంద కౌంట్ ధర కిలో రూ.220కు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చినప్పటికీ వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దెబ్బతీస్తున్నారు. కిలో రూ.240 ఇస్తే తప్ప గిట్టుబాటు కాదని ఆక్వా రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయడంతోపాటు క్రాప్ హాలిడేకు సైతం సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం ఆక్వా రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అత్యధికంగా దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రెండు జిల్లాల్లోని ఆక్వా రైతులు కోలుకోలేని పరిస్థితి నెలకొంది.



మామిడి ధర పతనంతో నష్టాలు

ఏలూరు జిల్లాలో దాదాపు 70 వేల ఎకరాల్లో మామిడి సాగు ఉంది. నూజివీడు ప్రాంతం మామిడి సాగుకు ప్రసిద్ధి. అకాల వర్షాలు, ఈదురుగాలులకు ఈ ఏడాది మామిడి దిగుబడి బాగా తగ్గిపోయింది. ఎకరాకు ఆరు టన్నుల వరకూ దిగుబడి రావాల్సి ఉండగా మూడు టన్నులు రావడమే గగనంగా మారిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మరోపక్క ధర లేక రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ప్రస్తుతం చిన్నరసాలు, కలెక్టర్ కాయలు టన్ను ధర రూ.13 వేలు పలుకుతోంది. టన్ను ధర కనీసం రూ.25 వేలు ఉంటే తప్ప గిట్టుబాటు ఉండదని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పెద్దఎత్తున పెట్టుబడి పెట్టిన మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోని పరిస్థితి.

కొల్లేరులో విధ్వంసంతో చేపల రైతులకు ఇక్కట్లు

కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామంటూ 2014-19 మధ్య కాలంలో టిడిపి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం సైతం చేసింది. ఇప్పుడు కోర్టు ఆదేశాలంటూ కొల్లేరులో వేలాది ఎకరాల్లో చేపల చెరువులను అటవీశాఖ అధికారులు ధ్వంసం చేస్తున్నారు. దీంతో చేపల సాగు చేసిన రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సి రావడంతో తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. కొల్లేరు రైతులను ఆదుకుంటామని చెబుతున్నప్పటికీ ఆచరణ మాత్రం లేకుండా పోయింది. దీంతో తమ సమస్యను పరిష్కరించాలంటూ కొల్లేరు రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. కొల్లేరులో చేపల సాగు చేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు మూడో కాంటూరుకు కుదింపు, జిరాయితీ, సొసైటీ భూముల అప్పగింతపై ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

నూతన పామాయిల్ పరిశ్రమ, మామిడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం ఎదురుచూపు

జిల్లాలో దాదాపు లక్షకుపైగా ఎకరాల్లో పామాయిల్ సాగు ఉంది. పెదవేగిలోని పామాయిల్ పరిశ్రమ పాతబడిపోయింది. దీంతో ఇక్కడ పామాయిల్ రికవరీ శాతం సరిగా రావడం లేదు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో రికవరీ శాతాన్ని నిర్ధారించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పామాయిల్ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.200 కోట్లతో కొత్త పామాయిల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని మాటలు చెబుతున్నారే తప్ప అడుగు ముందుకు పడటం లేదు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం కొత్తగా పామాయిల్ పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో ఒక్క కొత్త పామాయిల్ పరిశ్రమ కూడా ఏర్పాటు చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నూజివీడులో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామంటూ గత, ప్రస్తుత ప్రభుత్వాలు సైతం చెప్పాయి. ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటైతే మామిడి రైతులకు మేలు జరిగే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అమెరికా ఆంక్షలు ఎదుర్కొనేందుకు చర్యలు

20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్

ప్రజాశక్తి - భీమవరం




మాట్లాడుతున్న లంకా దినకర్

అమెరికా సుంకాల విధింపును సమర్ధవంతంగా ఎదుర్కొని, అత్యధికంగా రొయ్యల సాగు చేస్తున్న ఈ జిల్లాను ఆ ప్రభావం నుంచి బయటపడేలా ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామని 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి ఆయన సమీక్షించారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, వివిధ శాఖల అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి పొందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో వికసిత జిల్లాగా రూపుదిద్దే స్ఫూర్తితో పని చేయాలన్నారు. జిల్లాలో ఆక్వా రంగంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించే ప్రణాళికలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వ్యవసాయ, మెరైన్ ఆధారిత తయారీ, సేవ రంగంలో ఉపాధి అవకాశాలు పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సిపిఒ కె.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జెడి జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ మంగపతిరావు, డిపిఒ అరుణశ్రీ, డిఎస్ఒ ఎస్.సరోజ, మత్స్య శాఖాధికారి ఆర్‌విఎస్.ప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టెండర్ విధానంపై ఉద్యమిస్తాం

పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

ప్రజాశక్తి - యలమంచిలి


నినదిస్తున్న పంచాయతీ కార్మికులు

పంచాయితీల్లో టెండర్ విధానాన్ని అమలు చేస్తే జిల్లావ్యాప్తంగా ఉద్యమిస్తామని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని నేరేడుమిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ వర్కర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. స్థానిక పంచాయతీలో టెండర్ విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నించడంపై పంచాయతీ కార్యదర్శి, స్థానిక నాయకులతో మాట్లాడారు. టెండర్ విధానాన్ని అమలు చేయడం వల్ల 35, 40 సంవత్సరాలుగా పని చేస్తున్న పంచాయతీ చిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు టెండర్ విధానాన్ని అమలు చేయబోమని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో కొన్ని పంచాయతీల్లో పాత వారిని తొలగించి కొత్తవారిని పెట్టుకునేందుకు టెండర్ విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇది ఎంతమాత్రం సహేతుకం కాదన్నారు. దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్త ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవ సుధాకర్, శివ, కిరణ్, రాజశేఖర్, సత్యనారాయణ, రాజారెడ్డి, వాసు, శ్రీనివాస్, ఏడుకొండలు, రాము, శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధర వెంటనే తగ్గించాలి

సిపిఎం ఆధ్వర్యాన కొనసాగిన ఆందోళనలు



వీరవాసరంలో..

ప్రజాశక్తి - వీరవాసరం

పెంచిన గ్యాస్ ధరను తక్షణమే ఉపసంహరించాలని పెర్కిపాలెంలో సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గ్యాస్ సిలిండర్‌ను భుజాన వేసుకుని మోయలేని భారమంటూ నిరసన తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి బొర్రా ఆలమహారాజు మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు గ్యాస్ భారంతో కుదేలవుతున్నారన్నారు. అనంతరం వీరవాసరం బస్టాండ్ సెంటర్ వద్ద గ్యాస్ ధర పెంపుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో బొక్కా కూర్మారావు, కోరశిఖ విజయదుర్గ, బొక్కా మణి కుమారి, శ్రీనివాసరావు, యండమూరి సుబ్బారావు, గొట్టుముక్కల శ్యాంబాబు పాల్గొన్నారు.

భీమవరం: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యాన పట్టణంలోని చినరంగనిపాలెం, లంకపేట ప్రాంతాల్లో గురువారం ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై రూ.2 ఎక్సైజ్ సుంకం పెంచి ప్రజలపై మోయలేని భారాలు వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసరాల ధరలు తగ్గించకుండా గ్యాస్ ధర పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, అన్యం రాంబాబు, మల్లుల కృష్ణ, కుమరగిరి, సాయమ్మ, కుమారి, రమేష్, శామ్యూల్‌రాజు, యశోద, మరియమ్మ పాల్గొన్నారు.

భీమవరం టౌన్: పెంచిన గ్యాస్ ధరలు తక్షణం ఉపసహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని తోకతిప్ప గ్రామంలో పెంచిన గ్యాస్ ధర తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్యాస్ ధర తగ్గించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుమాని నాగేశ్వరరావు, గమ్మాని ఏడుకొండలు, పట్టెం శుభకరరావు, మోకా లక్ష్మణస్వామి, పొన్నాల లక్ష్మి, మోకా నాగేశ్వరరావు, కొప్పనాతి నాగార్జున, తిరుమాని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను రూ.50 పెంచడంపై మహిళా లోకం భగ్గుమంటోంది. గ్యాస్ ధర పెంపును ఉపసంహరించాలని సిపిఎం కొన్ని రోజులుగా చేపడుతున్న ఆందోళనా కార్యక్రమాల్లో మహిళలు స్వచ్ఛందంగా తరలొచ్చి పాల్గొనడమే దీనికి నిదర్శనం. సిపిఎం ఆధ్వర్యాన గురువారం కలగంపూడి, అబ్బిరాజుపాలెం, గుంపర్రు గ్రామాల్లో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, నాయకులు బాతిరెడ్డి జార్జి, గూడూరి ఆంజనేయులు, గుబ్బల సత్యనారాయణ, కడలి కుమారస్వామి, కుంచె రామచంద్రరావు, కండల్లి మందులయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: ధరలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకొచ్చి తగ్గించకపోగా గ్యాస్, పెట్రో ధరలు పెంచడం దుర్మార్గమని సిపిఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రియ్య విమర్శించారు. పెన్నాడ అగ్రహారంలోని 1, 2 వార్డుల్లో గ్యాస్, పెట్రో ధరల పెంపును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్, శ్రీరాములు, ఆంజనేయులు, దుర్గారావు, నాని, సుబ్రహ్మణ్యం, సత్యవతి, కనకమ్మ పాల్గొన్నారు.


భీమవరంలో..

ఉండి: గ్యాస్ ధర పెంచి సామాన్యులపై భారాలు మోపడం సరికాదని సిపిఎం నాయకులు ధనికొండ శ్రీనివాస్ విమర్శించారు. ఉండి మండలం అర్తమూరులో సిపిఎం ఆధ్వర్యాన కట్టెల పొయ్యి, ఖాళీ గ్యాస్ సిలెండర్‌తో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ధనికొండ శ్రీనివాస్, మండల కార్యదర్శి చీర్ల శేషు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రామకూరి వెంకటరత్నం, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పోడూరు: పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక కొత్తపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు బూరాబత్తుల వెంకట్రావు, పిల్లి ప్రసాద్, నమ్మితి శ్యాంసన్, బండి శ్రీను, గల్లి బ్రహ్మం, నందీశ్వరుడు, దొంగ నాగమణి, చెల్లబోయిన దుర్గాభవాని, సత్యవతి పాల్గొన్నారు.

మొగల్తూరు: కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారం మోపుతూ గ్యాస్ ధర పెంచడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో గ్యాస్ ధర పెంపును వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల చిట్టిబాబు, జి.పెద్దింట్లు, ఎ.సీతారత్నం, ఎ.పద్మావతి, పి.బేబీకుమారి, పి.ప్రసన్న, పి.రేవతి, ఎస్.పద్మ పాల్గొన్నారు.



ఉండిలో..



మొగల్తూరులో..



పోడూరులో..

ట్రంప్ నిర్ణయంతో ఆక్వా రంగానికి తీవ్ర నష్టం

15న ఆక్వా సమస్యలపై ఆందోళన - సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాల వల్ల మన దేశంలో ఆక్వా రైతులు నష్టపోతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. సముద్ర ఉత్పత్తులపై దిగుమతి సుంకాన్ని 26 శాతం విధిస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల భారత దేశం మీదే కాకుండా రాష్ట్రంలో, జిల్లాలో ఆక్వా రైతాంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపిందని తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయం వల్ల ఆక్వా ఎగుమతిదారులు విపరీతంగా రేట్లు తగ్గించడంతో ఆక్వా రైతులు తమ సరుకును అయినకాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క ఆక్వా ఉత్పత్తుల ధరలు పెరిగి ఆక్వా రైతులు ఆందోళన చెందుతుంటే, మరోపక్క ధర పతనం కావడంతో రైతులు దిగాలు పడ్డారని పేర్కొన్నారు. సుంకం ప్రకటన చేయగానే ధరలు ఈ విధంగా పతనమైపోతే, సుంకం అమలైతే పరిస్థితి ఏమిటోననే ఆందోళన రైతుల్లో నెలకొందని తెలిపారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఆక్వా రైతాంగ సమస్యలపై ఈ నెల 15 న భీమవరంలో ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతాంగమంతా తరలిరావాలని కోరారు.

గ్యాస్ డెలివరీ బోయ్స్‌పై వేధింపులు ఆపకపోతే సమ్మె

కనీస వేతనం రూ.26 వేలు అందించాలి
గ్యాస్ డెలివరీ బోయ్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు
కలెక్టరేట్ వద్ద గ్యాస్ డెలివరీ బోయ్స్ ధర్నా

ప్రజాశక్తి - భీమవరం



ధర్నాలో నినదిస్తున్న బోయ్స్, నేతలు

జిల్లాలో గ్యాస్ డెలివరీ బోయ్స్‌పై వేధింపులు ఆపకపోతే సమ్మె చేయడానికి వెనుకాడబోమని జిల్లా గ్యాస్ డెలివరీ బోయ్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్యాస్ డెలివరీ బోయ్స్ స్థానిక కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమను అన్నివిధాలా ఆదుకోవాలని నినదించారు. ఎన్నోఏళ్ల నుంచి వెట్టిచాకిరీ చేస్తున్నామని, కిలోమీటర్లు దూరం గ్యాస్ సిలిండర్లు రవాణా చేస్తున్నా కనీస ఛార్జీలు కూడా ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ గ్యాస్ డెలివరీ బోయ్స్‌కు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఇటీవల బోయ్స్‌పై అధికారులు, డీలర్ల వేధింపులు పెరిగాయన్నారు. డీలర్లు వాహనాలకు పెట్రోల్, డీజిల్ సమకూర్చడం లేదని, ఈ భారాన్ని కార్మికులు ఎలా తట్టుకోగలరని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకుని కనీస వేతనం రూ.26 వేలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతుందన్నారు. లేబర్ కోడ్‌లతో కార్మికులతో యాజమాన్యాలకు వెట్టిచాకిరీ చేయిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు గ్యాస్ డెలివరీ బోయ్స్ సంక్షేమ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

గ్యాస్ డెలివరీ బోయ్స్ నూతన కమిటీ ఎన్నిక

స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జిల్లా గ్యాస్ డెలివరీ బోయ్స్ ప్రథమ మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సభకు నాయకులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షత అధ్యక్షత వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ ముఖ్యఅతిథులుగా హాజరై మహాసభను ఉద్దేశించి మాట్లా డారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులుగా వై.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.వాసుదేవరావు, ఉపాధ్యక్షులుగా సీతారామయ్య, సనపల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా సత్యనారాయణరాజుతోపాటు మరో 14 మంది సభ్యులుగా కమిటీని ఎన్నుకున్నారు.

రోగుల పట్ల గౌరవంగా మెలగాలి : ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది గౌరవంగా మెలగాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆపరేషన్ థియేటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన టేబుళ్లను పరిశీలించారు. డిజిటల్ ఎక్స్‌రే యూనిట్లో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఫిజి క్యాట్రేజ్‌లను ప్రారంభించారు. పోస్టుమార్టం షెడ్‌లో సదుపాయాలను, డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.తాతారావు ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన సదుపాయాలను ఎంఎల్ఎకు వివరించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రయివేట్ ఆస్పత్రికి ధీటుగా వైద్య సేవలు అందించాలని, తాడేపల్లిగూడెం ఆస్పత్రిని జిల్లాలో ప్రథమస్థానంలో ఉంచేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు కల్పిస్తామని, దాతల సహకారంతో మరిన్ని సౌకర్యాలు అందిస్తామని అన్నారు. రోగులకు అందిస్తున్న మందులు సక్రమంగా పని చేస్తున్నాయో, లేదో రోగులను అడిగి తెలుసుకోవాలని డాక్టర్లకు సూచించారు. ప్రసూతి వార్డులో మరో రెండు ఎసిలు ఏర్పాటు చేయాలన్నారు. అవినీతిని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని వేల కోట్లతో ఉచితంగా మందులను అందిస్తోందని, మందుల నాణ్యతా ప్రమాణాలపై పరిశీలించాలన్నారు. ఆసుపత్రికి అవసరమైన టెక్నీషియన్లను ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర మంత్రి, నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ ఈ ఆసుపత్రి అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఎన్‌వి.సత్యనారాయణ, వర్ధనపల్లి కాశీ, పుల్లా బాబి, పైబోయిన వెంకటరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, ఐదు సంవత్సరాలుగా పిఎఫ్ కట్టడం లేదని కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంఎల్ఎ స్పందిస్తూ కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ తాతారావును ఆదేశించారు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

24న లేబర్ కార్యాలయాల వద్ద ఆందోళనలు
భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణరావు

తాడేపల్లిగూడెం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఈ నెల 24న జరిగే ఆందోళనల్లో భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణరావు పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో పసుపులేటి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన కూటమి నేతలు పది నెలలైనా మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 24న అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే ఆందోళనల్లో భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తూ ఇచ్చిన మెమో రద్దు చేయాలని, ఆరేళ్లుగా పెండింగులో ఉన్న క్లెయిములన్నీ పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో గూడూరి నాగేశ్వరరావు, సత్తి శ్రీనివాసరెడ్డి, వీర్రాజు, వెంకటేశ్వరరావు, మాధవ గంగారావు, నరసింహమూర్తి మాట్లాడారు

క్యూబా సంఘీభావ శాఖ నిధి సేకరణ


మొగల్తూరు : విరాళాలు సేకరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - మొగల్తూరు

కరోనా కాలంలో ప్రపంచ దేశాలకు వైద్య సేవలు అందించిన క్యూబాపై అమెరికా దుర్మార్గపు చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం మొగల్తూరులో ఉపాధి కూలీల వద్ద క్యూబా సంఘీభావ నిధిని జోలు పట్టి సేకరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. ఆయన వెంట సహాయ కార్యదర్శి ఎడ్ల చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

పెనుగొండ:క్యూబాకు సంఘీభావం తెలుపుతూ ప్రజల నుంచి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం విరాళాలు సేకరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి షేక్ పాదుషా నిర్వహించారు. ఈ సందర్భంగా దొంగగూడెంలో పాదుషాలో మాట్లాడారు. క్యూబా ప్రజలకు తమ వంతు కృషిగా అక్కడ ప్రజలకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో మాదాస్ నాగేశ్వరరావు నేలపు ఆదినారాయణ, పోతినేడి పద్మ, మహిళలు పాల్గొన్నారు.

గుడ్డ సంచులు వాడాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ బ్యాగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, గుడ్డ లేదా నార సంచులు వాడాలని పశువుల ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ జావర్ హుస్సేన్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో భీమవరం పశువుల ఆసుపత్రి వద్ద ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన, 50 గుడ్డ సంచులను గురువారం పంపిణీ చేశారు. జావర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల కేన్సర్ బారిన పడే అవకాశముందన్నారు. ఎడి సత్యనారాయణ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడే వారితో పాటుగా వాటిని విక్రయించిన వారిపై ప్రభుత్వం జరిమానాలు విధిస్తోందన్నారు. నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, శిరీష, బేబీ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి ద్వారా మహిళల అభివృద్ధి

ప్రజాశక్తి - గణపవరం

మహిళలు స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి సాధించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం స్థానిక మూడో సచివాలయంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యుల సంక్షేమంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. మహిళల జీవనోపాధికి టైలరింగ్ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ పూర్తిచేసిన అనంతరం నైపుణ్యం ఆధారంగా వారికి కుట్టుమిషన్లు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం సర్పంచి మూరా అలంకారం, ఎంపిడిఒ ఆర్.బేబీ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అనాకోడేరు పాఠశాలకు బ్యాటరీ సెట్ ఏర్పాటు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అనాకోడేరు డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు ఆర్థిక సాయంతో రూ.19,300 విలువగల స్టోరేజ్ బ్యాటరీ సెట్‌ను ఉచితంగా అందజేశారని పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ సుంకర పరమేశ్వరరావు తెలిపారు. ఈ బ్యాటరీని గురువారం అందజేయడంతో ఉపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రథమ సహాయకులు రేపాక వెంకన్న బాబు, ఉపాధ్యాయులు జి.నర్మద, ఎన్.దుర్గావరప్రసాద్, ఎం.వి.శ్రీలక్ష్మి, డి.అనూరాధ, కె.రాజేష్‌కుమార్ రాజు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సి పరిధిలోని గర్భిణులకు ప్రతి నెలా 9, 10 తేదీల్లో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తామని పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్మయి చెప్పారు. గురువారం స్థానిక పిహెచ్‌సిలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. పోషక విలువలు కలిగిన పదార్థాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 73 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ పద్మజ, స్టాఫ్ నర్సు డి.శిరోమణి, కె.సుహాసిని, ఆశాలు పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని కోట రోడ్డులో ఉన్న దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమరాధన చేశారు. యాత్రికులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దత్తసాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఫిషర్మెన్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా ఏసుబాబు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో సరిపల్లి ఫిషర్మెన్ కోపరేటివ్ సొసైటీ ఎన్నికలు గురువారం సరిపల్లిలో నిర్వహించారు. ఎన్నికల్లో ముంగర ఏసుబాబును అధ్యక్షులుగా, బైరా సత్యనారాయణను ఉపాధ్యక్షులుగా, మిగిలిన సభ్యులను డైరెక్టర్లుగా ఎన్నుకున్నారని భీమవరం ఎఫ్‌డిఒ పి.లావణ్య తెలిపారు కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం మత్స్యశాఖ సహాయకురాలు బొంకు షర్మిలాదేవి, టి.భాస్కరరావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కంప్యూటరీకరణ త్వరలో పూర్తికావాలి

ఆకివీడు :రైతు వారీగా సర్వే నంబర్ వారీగా నీటి తీరువా వివరాలను మరో 10 రోజుల్లోగా పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ పూర్తి చేయాలని కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ గ్రేట్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి సూచించారు. మండలంలోని నీటి తీరువా పరిస్థితులను, డేటా ఎంట్రీ పరిస్థితులను ఆయన గురువారం మండల రెవెన్యూ కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా విఆర్‌ఒలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి నుంచి రావాల్సిన నీటి పరిస్థితి సంబంధించి పూర్తి నోటిఫికేషన్ కలెక్టర్ విడుదల చేసేందుకు అన్ని చర్యలూ పూర్తిస్థాయిలో కంప్యూటర్ ద్వారా సిద్ధంగా ఉండాలన్నారు. 1434 ఫసలి (ప్రస్తుతం) వరకూ లెక్కలు పూర్తిగా తేల్చాలన్నారు. రైతుల నుండి ఇప్పటివరకూ నాలుగు ఫసలీలకు శిస్తు బకాయిలు ఉన్నాయని వివరించారు. సమావేశంలో తహశీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల అమల్లో అలసత్వం వద్దు

నరసాపురం: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అలసత్వం వహించొద్దని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంగిమాల దేవి అన్నారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలోని జ్యోతిబాయ్ పూలే బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలను, ఎల్‌బిచర్లలోని బిఆర్.అంబేద్కర్ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆయా పాఠశాలల్లో భోజనాలు చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. భోజనం, పరిసరాలను పరిశీలించారు. వంటశాలలను పరిశీలించి రోజు వారీ అమలు చేస్తున్న భోజన పట్టిక అమలు తీరుపై పరిశీలించారు. రుచి, శుచి, శుభ్రతతో కూడిన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత గురుకులు పాఠశాలల సిబ్బందిపై ఉందన్నారు. ఈ విషయంలో ఎటువంటి లోపాలు జరిగినా చర్యలు తప్పవన్నారు. లక్ష్మణేశ్వరం పాఠశాల ప్రిన్సిపల్ శైలజ, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

శృంగవృక్షంలో రీసర్వే గ్రామసభ

పాలకోడేరు:శృంగవృక్షం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సర్పంచి జంగం సూరిబాబు అధ్యక్షతన గురువారం రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజు రైతులకు, భూ యజమానులకు పలు సూచనలు చేశారు. రీసర్వేకు సంబంధించిన నోటీసులను తీసుకుని చేర్పులు మార్పులు ఏమైనా ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి ముఖ్య నేత కలిదిండి కృష్ణంరాజు (బుజ్జి), మండల సర్వేయర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కోదండరాం, రైతులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు..!

వాటర్‌ప్లాంట్లపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
నాణ్యతా ప్రమాణాలు లేక రోగాల పాలవుతున్న జనం

ప్రజాశక్తి - కాళ్ల

జల కాలుష్యంతో ఉండి నియోజకవర్గ ప్రజలకు తాగునీటి కష్టాలు రోజురోజుకీ తీవ్రరూపం దాల్చుతున్నాయి. భూగర్భ జలాలు పాడైపోవడం, పంచాయతీలు సరఫరా చేస్తున్న నీరు తాగడానికి పనికి రాకపోవడంతో ప్రజలు శుద్ధజలం కొనుగోలు చేసుకుంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని పల్లెల్లో ప్రయివేటు వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ ప్లాంట్ల నిర్వాహకులు కొంతమంది నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


సీసలిలో ఆటోలో తరలిస్తున్న నీటి డబ్బాలు

వాటర్‌ప్లాంట్లను పర్యవేక్షించాల్సిన వివిధ శాఖల అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఉండి నియోజకవర్గంలో దాదాపు 80 నీటి శుద్ధి కేంద్రాలు ఉండగా వాటిలో 20 కేంద్రాలు అనధికారికంగా నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం ఈ ప్లాంట్ల నిర్వాహకులకు వరంగా మారింది. జిల్లా ఆహార పరిరక్షణ విభాగం, భూగర్భ జలవనరుల శాఖ, రెవెన్యూ శాఖలు వాటర్ ప్లాంట్లను పర్యవేక్షించాల్సి ఉంది. వారు పట్టించుకోకపోగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే తమది కాదన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో కొనుగోలు చేసిన నీటిలో నాణ్యతా ప్రమాణాలు లోపించడంతో ఆ నీటిని తాగిన జనం రోగాల పాలవుతున్నారు. దీనికితోడు ప్లాంట్ల నిర్వాహకులు చాలాచోట్ల నీటి డబ్బాలను సక్రమంగా శుభ్రం చేయడం లేదు. దీనివల్ల వాంతులు, విరోచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు, హెపటైటిస్ వచ్చే ప్రమాదముంది. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను వివరణ కోరగా వాటర్ ప్లాంట్లపై తమ శాఖకు ఎటువంటి పర్యవేక్షణా ఉండదని సమాధానమిచ్చారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - పాలకోడేరు

నేటి సమాజానికి దాతల సహకారం ఎంతో అవసరమని, పాలకోడేరు సహకార సంఘం దాతృత్వంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఇంటర్నేషనల్ కోపరేటివ్ ఇయర్ కార్యక్రమాల్లో భాగంగా పాలకోడేరు సహకార సంఘం సహకారంతో భీమవరం మదర్ నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక సొసైటీ వద్ద గురువారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు, డిఎల్‌సిఒ వెంకటేశ్వరరావు, సొసైటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పివిఎల్ నరసింహరాజు కలెక్టర్ నాగరాణికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోపరేటివ్ పథకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వైద్యం ఎంతో ఖరీదైందని, ఈ నేపథ్యంలో పాలకోడేరు సొసైటీ అందిస్తున్న ఉచిత మెగా


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా సహకార అధికారి నాగారాజు, సొసైటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి నరసింహరాజు

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. జిల్లా సహకార అధికారి నాగరాజు మాట్లాడుతూ సొసైటీల ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, దీనిలో భాగంగా శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం మదర్ నెస్ హాస్పిటల్ కో ఫౌండర్‌లు మానస శ్రావ్య, వంశీ శివరామరాజు, మహిళలు, చంటి పిల్లల వైద్య నిపుణులు మాధురి, సందీప్, చైతన్య వర్మ, గోకుల్ నాథ్ వైద్య సేవలు అందజేసి 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ నాగరాణిని సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కునదరాజు మురళీకృష్ణంరాజు, సొసైటీ మాజీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు, సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, నీటి సంఘం అధ్యక్షులు ఏడుకొండల రాజు, మొగల్లు బాబు, పాలకోడేరు క్షత్రియ సేవాసమితి, వాకర్స్ క్లబ్ సభ్యులు రాజా రాజశేఖర్‌రాజు, అర్జున్‌రాజు, గాదిరాజు కృష్ణంరాజు (హేచరీస్ బాబు), రామకృష్ణంరాజు, తహశీల్దార్ ఎన్.భారతి విజయలక్ష్మి, ఇపిఆర్‌డి రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి, నాయకులు బలరాం కృష్ణంరాజు, జి.సూర్యనారాయణరాజు, కమ్మిలి రాంబాబు, జి.రాంబాబు, పాల్గొన్నారు.

పోషణ పక్వాడాపై అవగాహన


పోషణ పక్వాడాపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

ప్రజాశక్తి - కాళ్ల

అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అందుతుందని కాళ్ల అంగన్వాడీ సూపర్‌వైజర్ నిర్మల అన్నారు. దొడ్డనపూడి గ్రామంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ నిర్మల ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామంలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల కుటుంబ సభ్యులకు ఆహార ఆరోగ్య అలవాట్లు, వండే పద్ధతులు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

బొండాడపేటలో అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తొలుత అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సిహెచ్ హేమలత అధ్యక్షతన పోషణ పక్వాడా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి గుడ్ల మధుసూదనరావు, పంచాయతీ కార్యదర్శి మణికంఠ, అంగన్వాడీ కార్యకర్తలు సిహెచ్.కమల, కె.శ్రీదుర్గ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట : పౌష్టికాహారంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డివిఎస్ఆర్ఎస్.స్వర్ణకుమారి అన్నారు. కొడమంచిలి పంచాయతీ పరిధి టి.మెరక గ్రామంలో గురువారం గర్భిణులు, బాలింతలకు పౌష్టిక పక్వాడాపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వర్ణకుమారి మాట్లాడుతూ బాలింతలు తమ బిడ్డకు పాలు ఇచ్చినప్పుడే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరి చేరవని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం డి.పుష్పరాజ్యం, అంగన్‌వాడీ కార్యకర్త కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి : గర్భిణులకు, చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని యండగండి పిహెచ్‌సి వైద్య సిబ్బంది సూచించారు. యండగండి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం 122లో పోషణ పక్వాడా దళీశీఅవగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పి సాహితి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రోటీన్లతో కూడిన పౌష్టికాహారాన్ని అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు అందిస్తోందన్నారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం డి.రామలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు చిట్టి మరియ, సుజాత, సుబ్బలక్ష్మి, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : కిశోర బాలికల్లో రక్త హీనత రాకుండా చూసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి అంగర కృష్ణకుమారి కోరారు. నత్తారామేశ్వరం - 3, మార్టేరు - 1, 7 అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, కిశోర బాలికల్లో రక్తహీనత, చేతులు ఏ విధంగా శుభ్రం చేసుకోవాలి అనే విషయాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు టి.పోశమ్మ, పి.వరలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా యాగర్లపల్లి 25వ వార్డ్ అంగన్వాడీ 3వ కేంద్రంలో సిడిపిఒ టిఎల్.సరస్వతి అధ్యక్షతన తల్లులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు దుర్గా భవాని, విశాలాక్షి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. అలాగే పెదతాడేపల్లిలో అంగన్వాడీ కార్యాలయం వద్ద పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి మాట్లాడారు.

పాలకొల్లు రూరల్: వదేవుని చిక్కాల అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవం కార్యక్రమం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని సిహెచ్ ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇందిర మాట్లాడుతూ కాన్పు అయిన గంటలోపు ముర్రుపాలను శిశువుకు తల్లి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్.మంగ, పంచాయతీ సెక్రటరీ సుధారాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రామయ్య హాల్ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమం జరిగింది.

అభివృద్ధి పనులకు శ్రీకారం

కేంద్ర, రాష్ట్ర మంత్రులచే ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు

ప్రజాశక్తి - తణుకు

తణుకు పట్టణంతో పాటు తణుకు, ఇరగవరం మండలాల్లో సుమారు రూ.23.18 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు గురువారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నామన్నారు. తణుకు మున్సిపల్ సాధారణ నిధులతో పాటు రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, ఆర్అండ్‌బి నిధులతో రోడ్లు నిర్మాణం, సబ్‌స్టేషన్ వర్గోన్నతి, సిఎస్ఆర్ నిధులతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం, గ్రంధాలయ భవనాన్ని ప్రారంభించామన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

నోరుందని మాట్లాడితే చెల్లదు : మంత్రి

ఎప్పుడో అధికారంలోకి వస్తామని పగటి కలలుకంటున్న వైసిపి నాయకులు కక్షసాధింపు కొనసాగిస్తామని చెబుతూ నరికేస్తాం, బయటకు ఈడ్చేస్తామంటూ మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు వ్యాఖ్యలు సరికాదని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. గురువారం తణుకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతన రామరాజు, ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి శ్రీనివాసవర్మ మాట్లాడారు. రాజకీయాల్లో పదజాలం, మనం ఉపయోగించే భాష చాలా ముఖ్యమని తెలిపారు. అడ్డమైన వ్యక్తులు రాజకీయాల్లోకి రావడం, నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే రాజకీయాలు చెల్లబోవన్నారు. కారుమూరి ఎప్పుడు జైలుకు వెళ్తారో తెలియని పరిస్థితులు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయాలని, రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకురావాలని, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకు పరిమితం చేసిన రాష్ట్ర ప్రజలు ఓడించినప్పటికీ బుద్ధి రాకుండా వైసిపి నాయకులు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు అన్నారు. ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ తణుకు నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి, మాజీ అధ్యక్షులు నార్ని తాతాజీ, తణుకు ఎంసి ఛైర్మన్ కొండేటి శివ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజా కొంటాం

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పోడూరు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తెలిపారు. మండలంలోని జగన్నాధపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ గురువారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని తమకు నచ్చిన మిల్లుకు తరలించుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. ధాన్యం మిల్లుకు తరలించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోందన్నారు. రైతులు ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలు పాటించి తేమ 17 శాతం వచ్చేలా ధాన్యాన్ని ఆరబెట్టుకుని ప్రభుత్వ మద్దతు ధర 75 కిలోల బస్తా రూ.1,725, 100 కిలోలు బస్తా రూ.2,300 పొందాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని, రసాయన పురుగు మందులు, ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతులను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సబ్బితి సుమంగళి, నీటి సంఘం డైరెక్టర్ ధశక రామ్మోహన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆలమూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బు జమ చేస్తామని చెప్పి, కేవలం 24 గంటల్లోనే డబ్బు జామ చేశామన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు, పెనుమంట్ర డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వెలగల బులిరామిరెడ్డి, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షులు ఇందుకూరి వెంకట నరసింహరాజు పాల్గొన్నారు.

పెనుగొండ : రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పెనుగొండలోని చెరుకువాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం రైతు ధాన్యాన్ని కొనుగోలు చేసి సొమ్ము చెల్లించకుండా కాలయాపన చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని తెలిపారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పి.స్పందన, బడేటి బ్రహ్మాజీ, నాయకులు పాల్గొన్నారు.

ఆచంట: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి టి.శివరామ ప్రసాద్, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు జవ్వాది బాలాజీ, ఎంపిటిసి దాసిరెడ్డి పుణ్యావతి, మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఉండి

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు తనయుడు భరత్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని టిడిపి శ్రేణులకు పార్టీ మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలకు ఓసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని దానం చేయాలని, ఈ రక్తాన్ని తల సేమియా వ్యాధిగ్రస్తులకు హోప్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేయడం జరుగుతుందని తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలు వీడాలి : సిపిఐ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో అవగాహన కలిగించి చైతన్య పర్చాలని, అలాగే స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. భీమవరం పట్టణం మున్సిపల్ వర్కర్స్ సిపిఐ శాఖా మహాసభ గురువారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద జరిగింది. శాఖా మహాసభకు యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి సిపిఐ వందేళ్ల పండుగ సందర్భంగా పార్టీ చేసిన త్యాగాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - వీరవాసరం

భీమవరం 132 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం 11న విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు వీరవాసరం ఎలక్ట్రికల్ ఎఇ అప్పారావు గురువారం తెలిపారు. మండలంలోని వీరవాసరం, రాయకుదురు, కొణితివాడ, నవుడూరు, మడుగు పోలవరం, నేలపోగులు, అండలూరు, పంజావేమవరం, తోలేరు పడమటిపాలెం గ్రామాలకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

పెనుమంట్ర:దాతల సహకారంతో ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం కొయ్యేటిపాడు గ్రామంలో విర్బాక్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ఆర్ఒ ప్లాంట్ నీటిని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం కంపెనీ నిర్వాహకులు టి.శ్రీనివాసరెడ్డిని ఎంఎల్ఎ అభినందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సత్తిసాయి ఆదినారాయణ రెడ్డి, దొంగ శ్రీనివాస్, కడలి ఏడుకొండలు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ : ఒకరు మృతి

ప్రజాశక్తి - కాళ్ల

మండల పరిధిలోని ఏలూరుపాడు ఉప్పుటేరు వంతెన సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. కలిదిండి మండలం కొండంగి గ్రామానికి చెందిన షేక్ అమిర్ సాహెబ్ కలిదిండి నుంచి జువ్వలపాలెం బయలుదేరారు. మరో ద్విచక్ర వాహనంపై ఇద్దరు జువ్వలపాలెం నుంచి కలిదిండి వెళ్తుండగా ఏలూరుపాడు వద్ద ఈ రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో అమిర్ సాహెబ్ (56) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారు ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ లారీ ఢీ : వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని జల్లికొమ్మర వద్ద టిప్పర్ లారీ ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. ఎస్ఐ ఎం.మణికుమార్ వివరాల ప్రకారం. రాజమండ్రికి చెందిన కట్టా సుబ్రహ్మణ్యం (37) తన మోటారు సైకిల్‌పై కలిదిండి వెళ్తున్నాడు. గణపవరం మండలం జల్లికొమ్మర గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడి వద్దకు చేరుకున్న తరుణంలో వెనుక నుండి వస్తున్న టిప్పర్ లారీ అతనని ఢీకొంది. దీంతో సుబ్రహ్మణ్యం అక్కడక్కడే మృతి చెందాడు. లారీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మొగల్తూరులో పిచ్చికుక్క స్వైరవిహారం

మొగల్తూరు:మొగల్తూరులో గురువారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామంలో సత్తెమ్మ గుడి వీధి, శివాలయం వీధిలో ఇరువురు చిన్నారులను, పారిశుధ్య కార్మికులపై దాడి చేసి కరిచింది. వారికి మొగల్తూరు పిహెచ్‌సిలో డాక్టర్ దినేష్ కుమార్ పర్యవేక్షణలో టిటి ఇంజక్షన్లు, ఎఆర్‌వి వ్యాక్సిన్లు వేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం నరసాపురంలోని ఏరియా ఆసుపత్రికి పంపించారు.